క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా శిక్షణ



సంగెం : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా మార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎర్ర విజయ్‌కుమార్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు దినచర్యలో భాగంగా క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికాయుతంగా సిద్ధం కావాలని చెప్పారు. టీవీలు, సెల్‌ఫోన్లు, తదితరాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఏకాగ్రతతో కష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవడం సులువని స్పష్టం చేశారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బొజ్జ సురేశ్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మంకాల యాదగిరి, ఉపాధ్యాయులు చిలువేరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన చినగారి రాజు అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల కోసం గ్రామానికి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ సోమవారం రూ.5 వేల సాయం అందజేశారు. ఆయన డబ్బులు పంపించగా బాధిత కుటుంబానికి సోషల్ సర్వీస్ టీం సభ్యులు కర్ణకంటి రామ్మూర్తి, ముల్క సత్యనారాయణ అందజేసి మాట్లాడారు. రాజు కుటుంబం పేదరికంతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అంత్యక్రియల కోసం లక్ష్మీనారాయణ డబ్బు సాయం చేశారని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజు, మేకల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి చిత్రకళలో ఉచిత శిక్షణ

హన్మకొండ చౌరస్తా : సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి 21 వరకు చిత్రకళలో వేసవి శిక్షణశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అకాడమి డైరెక్టర్ సాగంటి మంజుల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, పెయింటింగ్ , క్రాఫ్ట్ వర్క్ అంశాల్లో శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్ ఉదయం 8–10 వరకు, రెండో బ్యాచ్ 10–12 వరకు, మూడో బ్యాచ్ సాయంత్రం 5–7గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు 81436 43337 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

వృద్ధులకు అండగా రెడ్‌క్రాస్

హన్మకొండ అర్బన్ : వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలందించేందుకు రెడ్‌క్రాస్ సంచార వైద్యశాల సేవలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. ఐఆర్‌ఎస్, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం భీమదేవరపల్లి మండలంలోని వంగరలో వృద్ధులకు ఉచితవైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని వయోవృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. ప్రతినెలా నిర్వహించే ఈ వైద్యశిబిరాలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో రెడ్‌క్రాస్ డాక్టర్లు డాక్టర్ జె.కిషన్‌రావు, మొహమ్మద్ తహర్ మసూద్, సిబ్బంది శివకుమార్, గంగాధర్, అనిల్, నరసింహాచారి, రాజు, నాయకులు గజ్జెల రమేష్, ఓల్లల రమేష్, రామోజు మొండయ్య, దేవరాజు, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య

న్యూశాయంపేట : కాకతీయ యూనివర్సిటీలో కవులు, రచయితలపై ఏబీవీపీ దాడి హేయమైన చర్య అని దాడి చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బి.చక్రపాణి డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో కేయులో సమూహ రాష్ట్ర సదస్సు జరుగుతుందని ఈ సందర్భంగా అనేక అంశాలపై చర్చలు జరుగుతున్న క్రమంలో హాల్ లోపలికి ఏబీవీపీకి చెందిన వారు వెళ్లి బ్యానర్‌ను చింపి సభను అడ్డుకోవడమే కాకుండా డాక్టర్ పసునూరి రవీందర్, ప్రొఫెసర్ కాత్యాని నరేశ్‌కుమార్, షాఫీ మెర్సి మార్గరేట్ భూపతి వెంకటేశ్వర్లు తదితరులపై దాడి చేశారన్నారు. అక్కడున్న మహిళలపై అనుచితంగా వ్యవహరించారన్నారు.

తాత్కాలిక వంతెన ఏర్పాటు

- కంఠాత్మకూరు వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి రోడ్డు డైవర్షన్

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు వాగుపై రూ.10 కోట్ల వ్యయంతో నూతనంగా ఫోర్ లైన్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. దీంతో వాగుపై తాత్కాలికంగా నిర్మించిన వంతనపై వాహనదారులు తగు జాగ్రత్తతో ప్రయాణించాలని ఆర్‌అండ్‌బీ డీఈ మహ్మద్ గౌస్ పాషా అన్నారు. సోమవారం కంఠాత్మకూరు వాగుపై నిర్మించే నూతన బ్రిడ్జి పనులను, తాత్కాలికంగా నిర్మించిన వంతెనను ఆయన పరిశీలించి మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు వాహనదారులు తగు జాగ్రత్తతో వెళ్లాలని, ముఖ్యంగా భారీ వాహనాల డ్రైవర్లు రోడ్డు డైవర్షన్‌ను గమనించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





తాత్కాలికంగా నిర్మిస్తున్న వంతెన

మిషన్ భగీరథ పనుల పరిశీలన

నడికూడ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేపట్టాల్సిన పనులను సోమవారం మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేశం పరిశీలించారు. మండల కేంద్రంలోని మంచినీళ్ల బావి నుంచి గొల్లపల్లి వరకు నీటి సరఫరా చేసేందుకు పైపులైన్ వేసే విధానంపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నడికూడ ఏఈ రమణ, పంచాయతీ కార్యదర్శి సందీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ మల్లేశం

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన లడే రాజేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా సోమవారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సందర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, ఎంపీటీసీ గడిపె విజయ్‌కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు : బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో వలసలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీని వీడుతున్న వారి సంఖ్య అధికమవుతోంది. వేలేరు మండలానికి చెందిన కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి ఆయన అనుచరులు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో సంపత్ రెడ్డి, చంద్రమౌళి, మహిపాల్, అనిల్, మల్లయ్య, రాజయ్య చేరారు.

సభకు తరలిన గుడిసెవాసులు

శాయంపేట : వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు హనుమకొండ హంటర్ రోడ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో తలపెట్టిన



బహిరంగ సభకు వెళ్తున్న గుడిసెవాసులు

బహిరంగ సభకు మండలంలోని మాందారిపేట గుడిసె వాసులు, సీపీఐ మండల కార్యదర్శి బత్తిని సదానందం ఆధ్వర్యంలో సోమవారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. 16 నెలలుగా చేస్తున్న గుడిసె వాసుల పోరాటంలో భూపట్టాలు, ఇళ్ల నిర్మాణ హామీని తీసుకుంటామని పేర్కొన్నారు. మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, గుడిసె వాసులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు మాజీ ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న చల్లా ధర్మారెడ్డి తదితరులు

పరకాల : మండలంలోని నాగారం గ్రామంలో గల రేణుకా ఎల్లమ్మ తల్లికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ తల్లి దీవెనతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. వరంగల్ మార్కెట్ మాజీ చైర్మన్ సదానందం, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పరకాల పీఏసీఎస్ చైర్మన్ గుండెబోయిన నాగయ్య, బండి సారంగపాణి, ఎంపీటీసీ శ్రీనివాస్, గౌడ సంఘం అధ్యక్షుడు ఏరుకొండ సంతోషం, ఉపాధ్యక్షుడు మార్క శ్రీనివాస్‌తో పాటు గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలునుంచి పడి వ్యక్తి మృతి



కమలాపూర్ : సికింద్రాబాద్ స్టేషన్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి సోమవారం ప్రమాదవశాత్తు జారి పడి హైదరాబాద్‌కు చెందిన మెంగోలు బాబు (49) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హైదరాబాద్‌కు చెందిన బాబు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో బెల్లంపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రైలు కమలాపూర్ మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌కు వచ్చి ఆగుతున్న క్రమంలో బాబు ప్రమాదవశాత్తు రైల్లోంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతనిని వెంటనే 108 సిబ్బంది ఈఎంటీ ఉపేందర్, పైలట్ మండ కేదారి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాబు మృతి చెందాడు. కాగా బాబు రైల్లోంచి పడి తీవ్రంగా గాయపడటంతో ఇంటర్ సిటీ రైలును ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో సుమారు అరగంట పాటు నిలిపేశారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు





క్షతగాత్రులు రమేశ్, ధర్మేందర్

కమలాపూర్ మండలంలోని మర్రిపల్లి శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లికి చెందిన చాలువేరు రమేష్, కమలాపూర్ నుంచి మెట్టుపల్లికి బైక్‌పై వెళ్తుండగా మర్రిపల్లి గ్రామ శివారులోకి వెళ్లగానే మర్రిపల్లికి చెందిన తుమ్మల ధర్మేందర్ బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి కాళ్లు విరిగాయి. క్షతగాత్రులను కమలాపూర్, హసన్‌పర్తి 108 అంబులెన్సుల ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

గుడుంబా స్వాధీనం



అరెస్టు చూపుతున్న పోలీసులు

పరకాల : పరకాల ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా గుడుంబా రవాణా చేస్తున్న ముగ్గురిని వేర్వేరు చోట్ల అరెస్టు చేసినట్లు స్థానిక ఎక్సైజ్ శాఖ సీఐ తాతాజీ తెలిపారు. రూట్ వాచ్ చేస్తుండగా శాయంపేట మండలం గట్లకనిపర్తి గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తున్న మాలోత్ రాజేందర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. 20 లీటర్ల గుడుంబాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా గట్లకానిపర్తి గ్రామంలో ఇంట్లో నాటుసారా అమ్ముతున్న బొమ్మకంటి రవి, రబియాలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై వై.జ్యోతి, సిబ్బంది లక్ష్మణాచారి, రవీందర్, లోకేష్ పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు ఉగాది పురస్కారం అందజేత

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చేరాల రాజశేఖర్ ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సంస్థ జాతీయ స్థాయి ఉగాది పురస్కారం –2024ను హైకోర్టు రిటైర్డ్ జడ్జి, మానవ హక్కుల కమిషన్ రిటైర్డ్ చైర్మన్ డాక్టర్ జి.చంద్రయ్య చేతుల మీదుగా అందుకున్నారు. సంస్థ ఆధ్వర్యంలో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో సేవ చేస్తున్న వారికి అందజేసే జాతీయ స్థాయి ఉగాది పురస్కారాలను హైదరాబాద్‌లోని సుందరయ్య కళా నిలయంలో ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు



అవార్డు అందుకుంటున్న రాజశేఖర్

ఈఎస్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఇ.సూర్యతేజ సుబ్రాంత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో విఫలం

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 100రోజులు పూర్తయిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీ లేని గారడీ మాటలతో మోసం చేసి అధికారం చేపట్టిందని ఆయన అన్నారు. మండలంలోని మైలారం, పెద్దకోడెపాక, పత్తిపాక, హుస్సేన్‌పల్లి గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పనుల ప్రదేశాల వద్దకు వెళ్లి కూలీలను కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి కూలీలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపిలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తెలంగాణ కోసం కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేండ్లు సీఎంగా పనిచేసి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రతి గ్రామాన్ని అభి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి

వృద్ధి చేశారని తెలిపారు. కరువు తెచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటుతోనే బుద్ధి చెప్పాలని, ప్రజల పక్షాన ప్రజల కోసం ప్రాణమిచ్చే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. తెలంగాణ హక్కుల కోసం పార్లమెంట్‌లో పోరాడాలంటే వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అరికిల్ల ప్రసాద్, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీటీసీ గడిపె విజయ విజయ్ కుమార్, నాయకులు జయపాల్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, అశోక్, తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

జనజాతర సభకు తరలి రావాలి

శాయంపేట : రేగొండ మండల కేంద్రంలో నేడు (మంగళవారం) నిర్వహించనున్న జనజాతర సభకు తరలిరావాలని ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్ పిలుపునిచ్చారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు, వైద్యుల వెంకటరాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు మండలంలోని 24 గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య వంతులను చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కుల నరేష్ రెడ్డి, నాయకులు చిట్టిరెడ్డి జంగారెడ్డి, ఎండీ వలిహైదర్, ప్రభాకర్ రెడ్డి, రాజు, రవి, లింగచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగ సాధనలో పోటీ పడాలి

సంగెం : ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో యువత పోటీ పడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎర్ర విజయ్‌కుమార్ ఆకాంక్షించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మండల కేంద్రానికి చెందిన రావుల క్రాంతి, చెదులూరి పరిమళ, నంగునూరి మానస, గూడెల్లి నవ్యలను మార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. కృషి, పట్టుదల, ప్రణాళికతో కష్టపడి చదివి వివిధ డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని తెలిపారు. యువత తల్చుకుంటే సాధించలేనిది ఏదీ లేదని స్పష్టం చేశారు. ఉద్యోగాలు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ సురేశ్, సింగారపు బాబు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కరుణశ్రీ, కిషన్‌కుమార్, చిర్ర రాజ్‌కుమార్, మొగిలి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన వారిని సన్మానిస్తున్న విజయ్‌కుమార్, తదితరులు

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



ఆత్మకూరు : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



దామెరలో..

దామెర : ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రభారి గుజ్జ సత్యనారాయణ అన్నారు. మండలంలోని దమ్మన్నపేటలోని 112వ బూత్‌లో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీజేపీని గెలిపించాలని అన్నారు. అసత్య ప్రచారాలు చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, బూత్ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, యువమోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల సమంత్, ప్రశాంత్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'అరూరి' గెలుపునకు కృషి చేయాలి

వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపునకు మాదిగ, దాని ఉపకులాలు కృషిచేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, మంద రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. అరూరి రమేశ్‌ను రెండు లక్షల మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు మాదిగలకు సముచిత స్థానం కల్పించకపోవడం రాజకీయంగా మాదిగలను సమాధి చేయడమేనని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి, నాయకులు వడ్డెపల్లి సాగర్, వడ్డెపల్లి రాజేష్, గోవిందు విజయ్ కుమార్, గోవిందు కరుణాకర్, చింతం ఈశ్వర్, బొర్ర జయపాల్, గజ్జి ప్రేమ్‌సాగర్, పోశాలు, ఐలయ్య, రాధక్క, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఆత్మకూరు : వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోరుతూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల కేంద్రంలో సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవిందు రవికుమార్, ఎంఎస్పీ పరకాల ఇన్‌చార్జ్ రాజు, నాయకులు సూరన్న, లక్ష్మణ్, నవీన్, మహేందర్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

'అరూరి రమేశ్ గెలుపు ఖాయం'

వేలేరు : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ వరంగల్ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు ఖాయమని ఆ పార్టీ



వేలేరు : ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు అన్నారు. సోమవారం మండలంలోని శాలపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఊరికి చేరాయన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతుందని చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ నాగవెల్లి యుగేందర్, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, కూరపాటి శ్రీనివాస్, అనిల్, అఖిల్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



పరకాల : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న దివ్యాంగురాలు గోరంట్ల సంధ్య తన పర్సును పోగొట్టుకుంది. సోమవారం పరకాల వైపు వస్తున్న క్రమంలో గూనిపర్తిలో బస్సు దిగిన తర్వాత తాను పర్సు పోగొట్టుకున్న విషయాన్ని గుర్తించి డయల్–100 సమాచారం ఇచ్చింది. దీంతో తక్షణమే స్పందించిన బ్లూకోల్ట్ సిబ్బంది సందీప్‌కుమార్, సుధాకర్ ఆమె పోగొట్టుకున్న పర్సులో రూ.6వేల నగదులో పాటు సెల్‌ఫోన్ ఉండగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితురాలు సంధ్యకు పరకాల సీఐ రవిరాజ్, ఎస్సై రమేష్ సమక్షంలో పోగొట్టుకున్న పర్సును అందజేశారు. ఈ సందర్భంగా బ్లూకోల్ట్ సిబ్బందిని సీఐ, ఎస్సై అభినందించారు.